# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాబోయే 2 సంవత్సరాల్లో 10 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు కృత్రిమ మేథ (ఏఐ) నైపుణ్య శిక్షణ అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ ఆరోగ్య భారత్ ఆవిష్కరణలో యోగా ప్రధాన పాత్ర పోషిస్తుందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
- ❖ కూటమి ప్రభుత్వ పాలన ప్రజల మనోభావాలకు అనుగుణంగా సాగుతోందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు.
- ❖ చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచేలా అఖండ గోదావరి ప్రాజెక్ట్ పనులు చేపడతామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

==============================

రాబోయే 2 సంవత్సరాల్లో 10 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు కృత్రిమ మేథ (ఏఐ) నైపుణ్య శిక్షణ అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లో బలమైన కృత్రిమ మేథ (ఎ.ఐ.) వ్యవస్థ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నామని స్పష్టం చేశారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ఎన్‌విడియా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 500 ఏఐ అంకుర సంస్థలు ప్రారంభం కానున్నాయని, విద్య, నైపుణ్యం నుంచి పరిశోధన, ఆవిష్కరణ వరకు రాష్ట్రం పునాది వేస్తోందని ముఖ్యమంత్రి వివరించారు.

==============================

ప్రపంచ వ్యాప్తంగా 150 దేశాలలో యోగాను గౌరవిస్తున్నారని పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా శాలిహుండం గ్రామంలో ఉన్న బౌద్ధారామంలో సుమారు 3 వేల మందితో ఈ రోజు నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కేంద్రమంత్రి కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఆరోగ్య భారత్ ఆవిష్కరణలో యోగా ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. యోగాను ప్రతీ ఒక్కరూ నిత్య జీవితంలో ఒక భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ స్థాపన

సాధ్యపడుతుందని తెలిపారు. యోగాను... భారతీయ సనాతన, సంస్కృతి సంప్రదాయాల్లో లభించిన సహజ సంపదగా అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం బలమైన దేశంగా ఎదిగిందని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ....

(వాయిస్ 27 సెకన్లు)

==============================

కూటమి ప్రభుత్వ పాలన ప్రజల మనోభావాలకు అనుగుణంగా సాగుతోందని ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఈ రోజు ఆయన అమరావతిలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... ప్రజలకు జవాబు దారితనంతో ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు. 38 పరీక్షలు నిర్వహించే విధంగా విజయవాడలో సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ ను ఏర్పాటు చేశామని, త్వరలో విశాఖపట్నం, తిరుపతి నగరాలలో కూడా ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. గ్రామాలలో వైద్య సేవలు అందించే 104 సంచార వైద్య సేవల వాహనాలలో 42 రకాలైన పరీక్షలు నిర్వహించే డయాగ్నస్టిక్ పరికరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలు పట్ల 74 శాతం మంది సంతృప్తిగా ఉన్నారని మంత్రి సత్యకుమార్ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

విరామం

==============================

చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచేలా అఖండ గోదావరి ప్రాజెక్ట్ పనులు చేపడతామని రాష్ట్ర పర్యటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. త్వరలో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగనున్న నేపథ్యంలో ఈ రోజు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఇతర అధికారులతో కలిసి రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్, హేవాలక్ బ్రిడ్జి ఇతర ప్రాంతాలలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... సాస్కి -2024-25 (స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్ మెంట్) sasci 2024-25 పథకం ద్వారా మంజూరైన 97 కోట్ల రూపాయలతో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, నిడదవోలు తదితర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. 2027లో జరగనున్న పవిత్ర గోదావరి పుష్కరాలకు ముందే అఖండ గోదావరి ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

==============================

స్వదేశీ పరిజ్ఞానంతో ఉన్నతమైన డ్రోన్ వ్యతిరేక వ్యవస్థ (యాంటీ డ్రోన్ సిస్టం) ను మచిలీపట్నంలో కేంద్ర రక్షణ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఐ డి ఎస్ టెక్నాలజీ తో రూపొందించామని ఆ సంస్థ డిప్యూటీ ఇంజనీర్ గోపాల్ తెలిపారు. ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... డ్రోన్ వ్యతిరేక వ్యవస్థ ను రాడార్, జామర్, డైరెక్ట్ లేజర్ వెపన్ సిస్టం వంటి మూడు భాగాలతో రూపొందించామని, ఈ పరికరాలు కమాండ్ కంట్రోల్ సిస్టం ద్వారా అనుసంధానమై ఉంటాయని చెప్పారు. "మేక్ ఇన్ ఇండియా" స్ఫూర్తితో తయారు చేసిన డ్రోన్ వ్యతిరేక వ్యవస్థ ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూరులో టర్కీ దేశ డ్రోన్లను భారతదేశ సరిహద్దులలో నిర్వీర్యం చేయడంలో విజయవంతంగా పని చేసిందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

==============================

గత 11 సంవత్సరాలుగా వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు రైతుల శ్రేయస్సును పెంచాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ రోజు ప్రధానమంత్రి స్పందిస్తూ... దేశంలో కష్టపడి పని చేసే రైతులకు సేవ చేయడం ప్రభుత్వానికి దక్కిన గౌరవంగా అభివర్ణించారు. భూమి ఆరోగ్యం, నీటిపారుదల వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించడంతో రైతులకు ప్రయోజనం కలిగిందన్నారు. రైతు

సంక్షేమం పట్ల ప్రభుత్వం చేసే ప్రయత్నాలు రాబోయే కాలంలో మరింత శక్తితో కొనసాగుతాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

==============================

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలంలో గణనీయమైన మార్పులు తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నా రు. ఈ రోజు మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులతో గుంటూరు జిల్లా ఉండవల్లిలో నిర్వహించిన శ్రవణమాధ్యమ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈ నెల 12 లేదా 14వ తేదీలోపే తల్లికి వందనం నగదు తల్లులకు అందిస్తామని వెల్లడించారు. ఈ నెలలోనే అన్నదాత పథకం కూడా ఇస్తామని, ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని పేర్కొన్నారు. అలాగే ఈ నెల 21వ తేదీన విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవవాన్ని ఒకేచోట 5 లక్షల మందితో నిర్వహిస్తున్నామని వివరించారు. అదే రోజున రాష్ట్ర వ్యాప్తంగా లక్ష చోట్ల యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

==============================

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ రోజు పర్యటించారు. పాణ్యం నియోజవర్గం, ఓర్వకల్లు మండలలోని గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ ను ఆయన సందర్శించారు. ప్రతినిధులను కలిసి ప్రాజెక్టు గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి, నిల్వ, డిమాండ్ కు సరిపడా విద్యుత్ ఉత్పత్తి ఈ ప్రాజెక్టు లక్ష్యమని భట్టి విక్రమమార్క  ఈ సందర్భంగా అన్నారు.

==============================

విశాఖపట్నంలో సౌత్ కోస్ట్ రైల్వేజోన్‌కి పనులు వేగవంతమయ్యాయని స్థానిక పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ తెలిపారు. ఈ రోజు విశాఖలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం సౌత్ కోస్ట్ రైల్వేజోన్‌కి జనరల్ మేనేజర్ ను నియమించిందని, విశాఖ రైల్వేస్టేషన్ ఉన్నతీకరణ జరుగుతుందని తెలియజేశారు.

==============================
==============================